క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్

శాలిగౌరారం: అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన సాంస్కృతిక సారధి కళాకారుడు వేముల నరేశ్ కుటుంబాన్ని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. నరేశ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు నరేశ్‌కు ఉన్న ఇద్దరు కుమారులు, కుమార్తెకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని ప్రకటించారు. వారివెంట మదర్ డెయిరీ డైరెక్టర్ లక్ష్మీనర్సింహారెడ్డి, శాలిగౌరారం, అడ్డగూడూరు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, ప్రభాకర్‌రెడ్డి, ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

నార్కట్‌పల్లి : మండల కేంద్రానికి చెందిన తెల్ల శ్రవణ్‌కుమార్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో నార్కట్‌పల్లి హైస్కూల్ 1993–94 ఎస్సెస్సీ బ్యాచ్ బాల్య స్నేహితులు ఆదివారం శ్రవణ్‌కుమార్ కుటుంబానికి రూ.50 వేలు అందజేశారు. కార్యక్రమంలో తరాల శ్రీనివాస్, మల్లెబోయిన రామలింగయ్య ఐలయ్య, నరసింహ, అశోక్, సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, స్వామి, జయమ్మ, సునిత, సైదమ్మ, తదితరులు ఉన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

కనగల్ : భూమి పట్టా ఉన్న రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని కనగల్ మండల వ్యవసాయధికారి బి.అమరేందర్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జూన్ 28, 2024 నాటికి భూమి పట్టా పొందిన రైతులందరూ అర్హులని తెలిపారు.

కేతేపల్లి: కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని కేతేపల్లి ఏఓ బి.పురుషోత్తం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినీ మరణించినా, పేరు మార్పు, ఇతర సవరణలకు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మర్రిగూడ : రైతులు రైతు బీమాకు ఆగస్టు 3 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ హేమలత కోరారు. ఆదివారం ఆమె స్థానికంగా మాట్లాడుతూ స్థానిక రైతు వేదిక కార్యాలయంలోని ఏఈఓలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



రుణాల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఆర్ఎం అలీముద్దీన్

నల్లగొండటౌన్: ఎస్‌బీఐ అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ మహమ్మద్ అలీముద్దీన్ అన్నారు. చిన్న మధ్యతరగతి వ్యాపారస్తులకు అందించే రుణాలపై ఆదివారం స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులకు రుణ మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు వంశీ, రంజిత్ గుప్తా, మైథిలి, త్రివేది, ప్రకాష్ రావు, సుశీల్ చంద్ర, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం

చిట్యాల: ప్రభుత్వం రైతులకు లక్ష రూపాయల వరకు రుణాలు మాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ పేరేపల్లి గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు అంతటి వెంకటేష్‌గౌడ్, జినుకుంట్ల నాగరాజు, సత్తయ్య, నర్సింహ, తిరుమలయ్య, లక్ష్మీనర్సింహ, శివ, లింగస్వామి, నజీర్, ఇద్దయ్య, యాదయ్య, నరేందర్, లింగస్వామి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా నల్లా కనెక్షన్లు !

- ఖాళీ ప్లాట్లకు నల్లా కనెక్షన్
- మిషన్ భగీరథ నీటితో కూరగాయల తోటలు సాగు
- పరిశీలించకుండానే గతంలో ఎం.బీ రికార్డు చేసిన అధికారులు !
- ప్రస్తుతం సర్వేలో బయటపడుతున్న నిజాలు



గట్టుప్పల్ మండల కేంద్రంలో నల్లా ఆఫ్ చేయకపోవంతో వృథాగా పోతున్న నీరు (ఫైల్)

చండూరు(గట్టుప్పల్) : అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా గట్టుప్పల్ మండల కేంద్రంలో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. గ్రామంలో ఉన్న కుటుంబాల కంటే నల్లా కనెక్షన్‌లే ఎక్కువగా ఉన్నాయి. ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేసిన నల్లాల ద్వారా నీరు వృథాగా పోతున్నా సంబంధిత సిబ్బంది పట్టించుకోవడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా అవసరం లేని చోట కూడా మిషన్ భగీరథ నల్లాలు ఏర్పాటు చేసి కాంట్రాక్టర్లు బిల్లులు దండుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎక్కడ పడితే అక్కడ నల్లా కనెక్షన్లు

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల గట్టుప్పల్ మండల కేంద్రంలో ప్రత్యేక యాప్ ద్వారా నల్లాల లెక్క సర్వే నిర్వహించారు. ఇందులో కుటుంబాలకు మించి నల్లాలు ఏర్పాటు చేసినట్లు సర్వే అధికారులు గుర్తించారు. కొన్ని ఇళ్లకు రెండు చొప్పున, ఖాళీ ప్లాట్లకు నల్లాలు, ఇంట్లో ఎవరూ నివసించకపోయినా(మైగ్రేటెడ్) వారి ఇంటి ఎదుట, అవసరం లేని దగ్గర నల్లాలు ఏర్పాటు చేశారు. ఎక్కడపడితే అక్కడ నల్లాలు ఏర్పాటు చేయడం వల్ల మిషన్ భగీరథ నీరు సరఫరా చేసిన సమయంలో అక్కడక్కడ నల్లాల ద్వారా నీరు వృథాగా పారుతోంది. ఖాళీ ప్లాట్లలో కొంతమంది కూరగాయల తోటలను ఏర్పాటు చేసుకొని మిషన్ భగీరథ నీటి ద్వారా ఏకంగా పంటలు పండించుకుంటున్నారు. రెండు సంవత్సరాలుగా అక్రమ కనెక్షన్లు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

అదనంగా 250 నల్లాలకు పైనే..

గట్టుప్పల్ మండల కేంద్రంలో సుమారు 1450 కుటుంబాలు (స్థానిక బోర్ల నుంచి నీటి సరఫరాకు ఏర్పాటు చేసిన నల్లాల ఆధారంగా) ఉన్నాయి. ఇందుకుగాను 1700 పైచిలుకు మిషన్ భగీరథ నల్లాల నీటి కనెక్షన్లను కాంట్రాక్టర్ ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ, మిషన్ భగీరథ సిబ్బంది ప్రత్యేక యాప్ ద్వారా చేసిన సర్వే ప్రకారం 250 నల్లాలు అధికంగా ఉన్నట్లు తేలింది. అనేక కుటుంబాలకు రెండు చొప్పున నల్లాలు ఏర్పాటు చేయగా, ఖాళీ ప్లాట్లు, ఆలయాలకు నల్లా కనెక్షన్లు ఇచ్చారు. నివసిస్తున్న కుటుంబాల సంఖ్యకు, నల్లాల ఏర్పాటుకు పొంతన లేకపోవడంతో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఆనాడు నల్లాలు ఏర్పాటు చేసినట్లు కాంట్రాక్టర్లు చెప్పగానే గుడ్డిగా ఎంబుక్ రికార్డు చేసిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు.. నేడు లెక్కింపు సందర్భంగా ఇబ్బందులు పడక తప్పడం లేదు.

తేడా పరిశీలిస్తున్నాం

ఒకే ఇంట్లో రెండు కుటుంబాలు ఉన్నాయంటే రెండు నల్లాలు ఏర్పాటు చేశారు. ఖాళీ ప్లాట్లలో ఇల్లు కట్టుకుంటున్నామని చెబితే నల్లాలు ఏర్పాటు చేయక తప్పలేదు. కుటుంబాలకు.. నల్లాల ఏర్పాటుపై తేడా పరిశీలిస్తున్నాం. నల్లాల లెక్క సర్వే దాదాపు పూర్తి చేశాం

–రామచంద్రయ్య, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

ఉచిత మెగా వైద్యశిబిరం



కళ్లద్దాలు అందజేస్తున్న జగన్మోహన్‌రెడ్డి

కేతేపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఆర్థికంగా ఉన్నవారు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ముందుకు రావాలని రిటైర్డ్ ఎస్‌ఐ అలుగుబెల్లి జగన్మోహన్‌రెడ్డి కోరారు. కేతేపల్లికి చెందిన చల్లా సుజాత జ్ఞాపకార్థం ఎల్‌బీనగర్ కామినేని హాస్పటల్ వారి సౌజన్యంతో ఆదివారం స్థానిక జెడ్పీహెచ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈవైద్య శిబిరానికి హాజరైన దాదాపు 200 మందికి బీపీ, షుగర్, బీఆర్ఎజీఎస్, కంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. అనంతరం మద్యం సేవించడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య శిబిరం నిర్వాహకులు చల్ల శ్యాంసుందర్‌రెడ్డి, పీఆర్‌ఓ బి.యాదగిరి, వైద్యులు చందన, వినయ్‌కుమార్, సీమ, శ్రీజ, కేశవరాం, నాయకులు జటంగి వెంకటనర్సయ్యయాదవ్, ఎ.మహేందర్‌రెడ్డి, మట్టి సాల్మన్, జటంగి సైదులు, ఎ.వీరాచారి, ఎం.పరుషయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వానాకాలం వరినాట్లు



శాలిగౌరారంలో వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు

- శాలిగౌరారం మండలంలో 19 వేల ఎకరాల్లో వరి సాగు అంచనా
- ఇప్పటికే 8 వేల ఎకరాలకు పైగా వరి నాట్లు పూర్తి

శాలిగౌరారం: మండలంలో వానాకాలం వరినాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దీంతో ట్రాక్టర్లకు, ఇటు కూలీలకు చేతినిండా పని దొరుకుతోంది. శాలిగౌరారం మండలంలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 19 వేల ఎకరాలకు పైగా వరి సాగు కానున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు సుమారు 8 వేల ఎకరాలకు పైగా వరినాట్లు పూర్తయినట్లు వ్యవసాయ అధికారుల నివేదికలు వెల్లడిస్తున్నాయి.

ఆయకట్టులో ఇప్పుడే ప్రారంభం

శాలిగౌరారం మండలంలో ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న శాలిగౌరారం ప్రాజెక్టు కింద ఆయకట్టులో వరినాట్లు ఇప్పుడే ప్రారంభమయ్యాయి. మూసీనది పరివాహక గ్రామాలతోపాటూ నాన్ ఆయకట్టులో బోరుబావుల కింద వరినాట్లు ముమ్మరంగా నడుస్తున్నాయి. మండలంలో మొత్తం 24 గ్రామపంచాయతీలు ఉండగా అందులో శాలిగౌరారం ప్రాజెక్టు కింద మండలంలోని 9 గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఏడు గ్రామాలు మూసీ నది పరివాహక గ్రామాలుగా, 8 గ్రామాలు నాన్ ఆయకట్టు గ్రామాలుగా ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో నాన్‌ఆయకట్టు గ్రామాల్లో వరి సాగు ఆలస్యం కానుంది. శాలిగౌరారం ప్రాజెక్టు నుంచి గతనెల 16న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వానాకాలం పంటసాగుకు నీటి విడుదల చేశారు.

తగ్గిన కూలీల కొరత

మండలంలో ప్రతి సంవత్సరం నాట్లు వేసేందుకు కూలీల కొరత రైతులను వెంటాడేది. కానీ ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి కూలీలు వరినాట్లు వేసేందుకు మండలానికి వలస రావడంతో కూలీల కొరత తగ్గింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం, ఒంగోలు, గుంటూరు జిల్లాలకు చెందిన కూలీలతోపాటు నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వరినాట్ల వేసేందుకు శాలిగౌరారం మండలానికి వలసలు వచ్చారు. దీంతో మండలంలో వరినాట్లకు కూలీల కొరత పూర్తిగా తగ్గింది.

సకాలంలో వరినాట్లు వేశాం



నాకున్న ఐదెకరాల భూమితోపాటూ మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకొని ఆరేడేళ్లుగా వరి సాగుచేస్తున్నా. ప్రతీ సంవత్సరం వరినాట్లు వేసేందుకు కూలీల కొరతతో ఇబ్బందులు పడేవాళ్లం. దీంతో ఆలస్యంగా నాట్లు వేసి దిగుబడి సరిగ్గా రాక నష్టపోయేవాడిని. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కూలీలు మా మండలానికి వలస రావడంతో ఈసారి సకాలంలో వరినాట్లు వేశాం. ఇబ్బందులు తప్పాయి.

–చిత్తలూరి శ్రీనివాసులు, రైతు, శాలిగౌరారం

స్వల్పకాలిక రకం వరి వంగడాలనే సాగుచేసుకోవాలి



ప్రస్తుతం నారు పోసుకునేందుకు అదును దాటిపోయింది. వరి సాగుచేసేందుకు సిద్ధమయ్యే రైతులు స్వల్పకాలిక రకాలకు చెందిన వరి వంగడాలనే ఎంచుకోవాలి. దీర్ఘకాలిక వంగడాలను సాగుచేస్తే దిగుబడి తక్కువ వస్తుంది. ఇప్పటికే నాట్లు వేసిన రైతులు తెగుళ్ల రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

–సౌమ్యశృతి, ఏఓ, శాలిగౌరారం

●పూర్వ విద్యార్థుల సమ్మేళనం



యరగండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006–07 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, భూషయ్య, రవీందర్‌రావు, రాంరెడ్డి, మూర్తి, వీరేశం, రమణ, సులేమాన్, శ్రీను, లాలు, రజిని, వల్లంల సంతోష్, శ్రీను, శ్రీశైలం, ముత్తు అనిల్, మహేందర్, జయంత్, మహేష్, లక్ష్మణ్, సరిత, రాణి, ప్రశాంతి, సరిత, మంజుల, జ్యోతి, శంకర్ పాల్గొన్నారు. –మర్రిగూడ

నేడు సీపీఎం పాదయాత్ర

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య పిలుపునిచ్చారు. ఆదివారం కేతేపల్లిలో నిర్వహించిన పాదయాత్ర సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బొప్పారంలో 6 గంటలకు ప్రారంభం కానున్న పాదయాత్ర కాసనగోడు, మేడిపల్లిగూడెం, గుడివాడ, కొర్లపహాడ్ గ్రామాల మీదుగా కేతేపల్లి తహసీల్దారు కార్యాలయం వరకు చేరుకుంటుందని తెలిపారు. పాదయాత్రలో అన్ని గ్రామాల రైతులు, మేధావులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు ఎల్.రాజు, వంగూరి వెంకన్న, సుంకరి సత్తయ్య, నీలం సైదులు, పెరిక మల్లయ్య, బండమీది అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాళికామాత బోనాలు



బోనాలతో కాళికామాత ఆలయానికి ప్రదర్శనగా వస్తున్న భక్తులు



తొలి బోనంతో వస్తున్న పోరెండ్ల శివసాయి కృష్ణ-హరిత దంపతులు



వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

నకిరేకల్ : పట్టణంలోని సంతోష్‌నగర్‌లో వెలిసిన శ్రీ స్వయంభు కాళికామాత ఆలయంలో ఆదివారం ఆషాఢ మాసం బోనాల వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి కాళికామాత అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు బోనాలు తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి బోనాల వేడుకల్లో పాల్గొని ఆలయానికి రూ.ఐదు వేల విరాళం అందజేశారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, కాంగ్రెస్ నేత దైద రవీందర్, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మదేవర రవిశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకల్లో స్థానిక 4వ వార్డు కౌన్సిలర్ గాజుల సుకన్యశ్రీనివాస్, పోతుల సునీతరవీందర్, ఆలయ ప్రతినిధులు యల్లపురెడ్డి యాదగిరెడ్డి, కందాళ నారాయణరెడ్డి, గర్రె మురళీమోహన్, గోకికార పరమేష్, శ్రీను, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి తొలి బోనం

కాళికామాత అమ్మవారి బోనాల పండుగ సందర్భంగా నకిరేకల్‌కు చెందిన పోరెండ్ల శివసాయి కృష్ణ–హరిత దంపతులు అమ్మవారికి తొలిబోనం సమర్పించారు. ప్రతిఏటా అమ్మవారి బోనాల పండుగ సందర్భంగా తొలి బోనం కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహిస్తున్నారు. గడిచిన రెండేళ్లుగా శివసాయి కృష్ణ–హరిత వేలంపాట దక్కించుకుని మొదటి బోనం సమర్పిస్తున్నారు. ఈ ఏడాది కూడా శివసాయి కృష్ణ దంపతులు రూ.10 వేలు పాట పాడి తొలి బోనం సమర్పించారు.

విద్యార్థులకు పురస్కారాలు అందజేత

రామగిరి(నల్లగొండ): నల్లగొండ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 10 జీపీఏ, ఉత్తమ గ్రేడ్ సాధించిన విద్యార్థులకు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సిద్ధార్థ యోగా విద్యా నిలయం ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. 27 ప్రభుత్వ పాఠశాలల్లో 75 మంది విద్యార్థులను, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులను చేనేత శాలువాలతో సన్మానించి ప్రశంసా పత్రం జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కత్తుల అరుంధతి, డాక్టర్ రామచంద్రరావు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థల చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి, పర్యావరణవేత్త మిట్టపల్లి సురేష్ గుప్తా,ముక్కమాల నరసింహ ఎండీ అజీజ్, బొమ్మపాల గిరిబాబు, వివిధ పాఠశాలల ప్రధానోపాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం పరిశీలన

నల్లగొండ టూటౌన్: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పెరిక మునికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల ప్రభుత్వ బాలుర ఎస్సీ వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బాకి నరసింహ, దాసరి ఈశ్వర్, కృష్ణ, ముత్యాల శంకర్‌రెడ్డి, దేవేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చండూరు : లయన్స్ క్లబ్ చండూరు సేవ నూతన కార్యవర్గాన్ని డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ లయన్ కేవీ ప్రసాద్ సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంగు జానయ్య, ఇమిడియేట్ పాస్ట్ మల్టీపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా తీగల మోహన్‌రావు, కోశాధికారులుగా లతీఫ్ పాషా, వెంకట్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీశైలం, యాదగిరి, సతీష్ శ్రీనివాస్, దోటి వెంకన్న, లవకుమార్, రఘుమారెడ్డి, నాగరాజు, మహేందర్, కోడి అరుణ, లేడీస్ కోఆర్డినేటర్ స్వాతి, నాగలక్ష్మి, శ్రీవాణి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



నల్లగొండలోని శివాజీనగర్ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు



శివాజీనగర్‌లో బారులుదీరిన భక్తులు

నల్లగొండ: గురుపౌర్ణమి సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం జిల్లా కేంద్రంలోని రామగిరిలో ఉన్న సాయిబాబా ఆలయంలో స్వామివారికి అభిషేకాలు చేశారు. అదేవిధంగా ముశంపల్లి రోడ్డులోని సాయిబాబా ఆలయంలో అర్చనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ఆర్టీఓ రవి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, ఆలయ కమిటీ నిర్వాహకులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో గుత్తా పూజలు

నల్లగొండ టూటౌన్: గురు పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని శివాజీనగర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం కార్యక్రమంలో పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు.

నకిరేకల్ : పట్టణంలోని శ్రీ ఐశ్వర్యసాయి మందిరంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున కాగడ హారతి, శ్రీ సాయి నాథుడికి భక్తులు 108 కళశాలతో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి దుర్తి మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో గోపూజ, సామూహిక సచ్చరిత్ర పారాయణం, సామూహిక వ్రతాలు వైభవంగా జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి అన్నదానం కోసం రూ. 30 వేల విరాళం అందజేశారు. ఆలయ చైర్మన్ వనమా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో కాంగ్రెస్ నేత దైద రవీందర్, 4,15 వ వార్డుల కౌన్సిలర్లు గాజుల సుకన్యశ్రీనివాస్, యాసారపు లక్ష్మీవెంకన్న, ఆలయ ప్రతినిధులు యాట మధుసూదన్‌రెడ్డి, గట్టు శ్యాం, ఉప్పల వెంకటరమణ, వలిశెట్టి స్వప్న, రామచొక్కం తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండల కేంద్రంలోని శ్రీసాయిమణికంఠ ఆలయం, అయిటిపాముల గ్రామంలోని శ్రీసాయిబాబా ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఆలయ పూజారులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు, హారతి, పుష్పాలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, ఆలయ పూజారి కొటారు సత్యనారాయణశర్మ, వంగూరి లక్ష్మయ్య, పోగుల నర్సింహ, గద్దపాటి దానయ్య, కడారు మల్లికార్జున్, రాపోలు వెంకటేశ్వర్లు, కొల్లు వీరేశం, కృష్ణవేణి, అంజమ్మ, పద్మ, రేణుక పాల్గొన్నారు.

చిట్యాల: వట్టిమర్తి గ్రామ పరిధిలోని సాయిబాబా ఆలయం, చిట్యాల సాయి ద్వారకాపురి కాలనీలోని సాయి ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వట్టిమర్తి ఆలయంలో రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందజేశారు.

ఆర్గానిక్ కృష్ణ మందిర్‌లో హోమం

చిట్యాల మండలంలోని తాళ్లవెల్లెంల గ్రామంలో గల ఆర్గానిక్ కృష్ణ మందిర్‌లో గురు పౌర్ణమి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకృష్ణుడి విగ్రహానికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక హోమం నిర్వహించారు. అనంతరం పూజలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణను ఆలయ నిర్వాహకుడు పామనగుళ్ళ వెంకటేశ్వర్లు ఏర్పాటు చేశారు. వేడుకల్లో అమర్‌నాథ్, ఫణి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మర్రిగూడ : గురు పౌర్ణమి సందర్భంగా మండలంలోని మేటిచందాపురం పరిధి ఇందుర్తి గ్రామంలో తమకు చదువు చెప్పిన గురువు మదన్‌రెడ్డిని శిష్యులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చెరుకు లింగంగౌడ్, కుంభం సురేందర్‌రెడ్డి, జాల వెంకటేష్, రవీందర్‌రెడ్డి, శేఖర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



కట్టంగూర్ : సాయిబాబా విగ్రహానికి అభిషేకం చేస్తున్న భక్తులు



నకిరేకల్ : వేడుకల్లో పాల్గొన్న డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, దైద రవీందర్



మర్రిగూడ : ఉపాధ్యాయుడు మదన్‌రెడ్డిని సన్మానిస్తున్న శిష్యులు



నకిరేకల్ : సాయి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు



చిట్యాల: వట్టిమర్తిలో పూజలో పాల్గొన్న శాసన మండలి చైర్మన్ గుత్తా